క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పూజలు



పూజల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో పెద్దమ్మ, సుంకులమ్మ, సవారమ్మ, గంగమ్మ, వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన, శ్రీలక్ష్మీ వేంకటేశ్వర గరుడ ధ్వజస్తంభాల పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, గౌరు వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉలిందకొండ రమణారెడ్డి, నాగేష్, శీనయ్య, శ్రీనివాసులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

సి.బెళగల్: అనుమతి లేకుండా ఇసుకను రవాణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మన్మధ్‌విజయ్ అన్నారు. మండలంలోని గ్రామాల్లో శుక్రవారం గస్తీ నిర్వహించారు. తిమ్మందొడ్డి గ్రామంలో తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు టాక్టర్లను పట్టుకున్నారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసి, వాహనాలను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులను కోరారు.

కేసీకి 159 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.917 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

బీజేపీ నేతల తీరు సరికాదు

కోడుమూరు రూరల్: కోడుమూరు ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడిన బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి కోరారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఒక అమ్మాయి అబ్బాయి సమస్య ఇంటి వద్ద జరిగితే దానిని తీసుకొచ్చి ఉపాధ్యాయులపై ఆరోపణలు చేయడం బీజేపీ నాయకుల అవివేకమన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు సిద్ధు, ప్రవీణ్, నవీన్ ఉన్నారు.

రేమడూరులో బొడ్రాయి ఏర్పాటుకు హైకోర్టు బ్రేక్

కర్నూలు(లీగల్): కల్లూరు మండలం రేమడూరులో నూతనంగా బొడ్రాయి ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన నాయకంటి బజారన్న ఆర్.మద్దయ్య, టి.పుల్లన్న, మరో ఇద్దరు ప్రయత్నించగా ప్రజలకు అసౌర్యమవుతుందని గ్రామ పంచాయతీ సెక్రటరీ నిలుపుదల చేశారు. దీనిపై వారు హైకోర్టును ఆశ్రయించగా కొత్త బొడ్రాయి దారి మధ్యలో ఏర్పాటు చేస్తే ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని శుక్రవారం పేర్కొంటూ విచారణను జనవరి 29కి వాయిదా వేసింది.

పైప్‌లైన్ గుంతను పూడ్చండి సారూ



పైప్‌లైన్ మరమ్మతు కోసం తవ్విన గుంత

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని రైతు బజార్ నుంచి సీ క్యాంప్ క్వార్టర్స్–శ్రీరామ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో రెండు నెలల క్రితం పైప్‌లైన్ లీకవ్వడంతో గుంతను తవ్వి వదిలేశారు. స్కూల్ పిల్లలు, ప్రయాణికులు ప్రతి రోజూ ఈ రోడ్డు మీదుగా వెళ్తుంటారు. గుంతను తవ్వి వదిలేయడంతో ఎవరైనా ఆదమరిస్తే గుంతలో పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి పైప్‌లైన్ గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల వ్యాన్ బోల్తా



బోల్తాపడిన వ్యాన్

కల్లూరు: ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిరుమలగిరి వద్ద 44వ జాతీయ రహదారిపై కళ్యాణి పాఠశాలకు చెందిన వ్యాన్ బొల్తా పడింది. ఈ ప్రమాదంలో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. వారిని 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై ఉలిందకొండ పోలీసులు విచారిస్తున్నారు.

ఆధునిక వైద్యం.. అపురూపం

- ఆధునిక చికిత్సల్లో ప్లాస్టిక్ సర్జరీ ముందంజ
- రూపం కోల్పోయిన వారికి యథా స్థితికి తెచ్చే సర్జరీలు
- ఏటా వెయ్యికి పైగా అరుదైన ఆపరేషన్లు
- కాలిన గాయాల రోగులకు స్వాంతన
- అత్యాధునిక మైక్రోస్కోప్‌తో ఆపరేషన్లు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీజీ సీట్లు మంజూరుతో పాటు పలు వైద్య పరికరాల ఏర్పాటు
- ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి నూతన భవనం

తెగిన చేతిని మళ్లీ అతికించడం, తెగిపడిన తలను మళ్లీ మంత్రదండంతో సరిచేయడం పాత జానపద సినిమాల్లో మాత్రమే చూసుంటాము. ఆధునిక వైద్యరంగంలో ఇప్పుడు అది కూడా సాధ్యమైంది. నిర్ణీత సమయంలో తెగిపడిన శరీర భాగాలను తీసుకొస్తే అతికించడం ఇప్పుడు పెద్ద కష్టం కాదు. దీనికి ప్రభుత్వ ప్రోత్సాహం తోడైతే వైద్యులు వారి వైద్యానికి మరింత వన్నెలద్దుతారు. ఇందుకు ప్లాస్టిక్ సర్జరీ వైద్యవిభాగంలో జరుగుతున్న అద్భుతాలే నిదర్శనం.



ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో రోగులకు సేవలందిస్తున్న వైద్యులు



ప్లాస్టిక్ సర్జరీ విభాగం



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ఒకప్పుడు ఒక్కరే డాక్టర్ ఉండేవారు. ఈ విభాగంలో ఆపరేషన్ చేయించుకోవాలంటే నెలల తరబడి వేచి ఉండాల్సిందే. ఈ క్రమంలో ఈ విభాగంలో క్రమంగా వైద్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఒక ప్రొఫెసర్ డాక్టర్ మంజులబాయి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ స్వతంత్ర భారతి, డాక్టర్ విజయచంద్రమౌళి, డాక్టర్ సింధు ప్రియాంక ఉన్నారు. 2020లో ఈ విభాగానికి ఒక పీజీ సైతం రావడంతో ప్రస్తుతం ముగ్గురు పీజీలు వైద్యం చేస్తూ విద్యను అభ్యసిస్తున్నారు. దీంతో ఒకప్పుడు ఆపరేషన్‌కు నెలల తరబడి ఎదురుచూసే పరిస్థితి నుంచి ప్రస్తుతం వారం, పదిరోజుల్లో పూర్తవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన రూ.2.5 కోట్ల విలువ గల మైక్రోస్కోప్ పరికరంతో ఈఎన్‌టీతో పాటు ఈ విభాగమూ అత్యాధునిక ఆపరేషన్లు నిర్వహిస్తోంది. దీంతో పాటు ఇటీవల రెండు బాయిల్స్ ఆపరేటర్స్, రెండు సక్షన్ ఆపరేటర్స్, ఒక సియామ్ మిషన్‌ను, మొబైల్ ఆపరేటింగ్ ఫోకస్ లైట్ కొనుగోలు చేసి ఇవ్వడంతో శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు మరింత సులువైంది. ప్లాస్టిక్ సర్జరీతో పాటు కాలిన గాయాలకూ ప్రత్యేక విభాగం ఇక్కడ ఏర్పాటు చేశారు. 20 పడకలకు పైగా ఉన్న ఈ విభాగంలో నిత్యం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సేవలందిస్తుంటారు.

నిర్వహిస్తున్న శస్త్రచికిత్సలు

ప్లాస్టిక్ సర్జరీలో భాగంగా గ్రహణ మొర్రి, పుట్టుకతో వచ్చే అంగవైకల్యాలను సరిచేయడం, ఫేషియల్ సర్జరీ, ట్రామా అండ్ మ్యాక్సిలో ఫేసియల్ ఫ్రాక్చర్స్, రీ కన్స్ట్రక్టివ్ సర్జరీ, కాస్మోటిక్స్, ముక్కు సర్జరీ, ముఖంపై గాయాలు, చేతిగాయాలకు చికిత్స, చర్మం వేయడం, ఫ్లాప్ సర్జరీ, హైపోస్పేడియాసిస్, కాలినగాయాలకు చికిత్స, గైనకోమాస్టియా(మగవారిలో పెరిగిన రొమ్ములను సరిచేయడం), రొమ్ము పెంచడం వంటి శస్త్రచికిత్సలను నిర్వహిస్తున్నారు.



ఆపరేషన్‌కు ముందు, తర్వాత

నాలుగేళ్లుగా వైద్యసేవలు

సంవత్సరం	ఓపీ రోగులు	ఐపీ రోగులు	శస్త్ర చికిత్సలు
2020	1,423	356	263
2021	3,960	823	972
2022	4,612	968	1,023
2023	3,686	817	1,362



ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి నూతన భవనం

నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రీవెన్షన్ ఆఫ్ ది బర్న్ ఇన్‌జ్యూరీస్ (ఎన్‌పీపీడీబీఐ) కింద కేంద్ర ప్రభుత్వం 2017 మార్చిలో రూ.4.5 కోట్ల ప్రాజెక్టును మంజూరు చేసింది. ఇందులో రూ.2.5 కోట్లను కేంద్రం, 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉన్నా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 2019 వరకు మంజూరు చేయలేదు. అయితే, ప్రస్తుత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభమయ్యాయి. ఈ భవనంతో పాటు ఆధునిక వైద్యపరికరాలు రానున్నాయి. అలాగే అదనంగా వైద్య సిబ్బంది నియమితులవుతారు. దీంతో ప్లాస్టిక్ సర్జరీ, కాలిన రోగుల విభాగాలకు వచ్చే రోగులకు మరింత నాణ్యమైన వైద్యం అందే అవకాశం ఉంది.

అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్నాం



ఆసుపత్రిలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం వైద్యులు ఉండటంతో పీజీ సీట్లు మంజూరయ్యాయి. దీంతో పీజీ వైద్యులు కూడా వచ్చారు. వైద్యుల సంఖ్య పెరగడంతో ఇక్కడ చేరే రోగులకు సత్వర చికిత్స, నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. రోగి ఆసుపత్రిలో చేరిన వెంటనే అవసరమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాము. ప్రత్యేకంగా మైక్రోస్కోప్ ఉంటే ఇంకా మెరుగైన సేవలు అందించే వీలుంది.

–డాక్టర్ ఎం. మంజులాబాయి, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడి, జీజీహెచ్, కర్నూలు

తలపై చర్మం ఏర్పాటు చేశారు



నేను కూలీ పనులు చేసుకుని జీవించేదాన్ని. ఇటీవల నాకు బ్రెయిన్‌లో ట్యూమర్ ఉండటంతో ఆపరేషన్ చేశారు. అయితే ఆ సమయంలో పుర్రె పై భాగంలో ఉన్న చర్మం గ్యాంగ్రిన్ వచ్చి దెబ్బతింది. నాకు అప్పుడప్పుడు ఫిట్స్ కూడా వస్తుండటంతో గాయం పెద్దదైంది. మూడు నెలల క్రితం ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి రాగా డాక్టర్లు చేర్చుకున్నారు. అప్పుడు రక్తంలో హిమోగ్లోబిన్ 4 శాతం మాత్రమే ఉంది. నాలుగు ప్యాకెట్లు రక్తం ఎక్కించి మరీ ఆపరేషన్ చేసి తలపై చర్మాన్ని అతికించే ఆపరేషన్ చేశారు. ఇప్పుడు నాకు బాగుంది.

– లక్ష్మీదేవి, దువ్వూరు గ్రామం, వైఎస్‌ఆర్ జిల్లా

ఇక బతకనేమోనని అనుకున్నా..



నేను గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నాను. నాకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండు నెలల క్రితం ఓ రోజు గొర్రెలు మేపుతుండటంతో ప్రమాదవశత్తూ విద్యుదాఘాతానికి గురయ్యాను. ఈ ప్రమాదంలో కుడి చేయి పూర్తిగా దెబ్బతినడంతో తీసేశారు. తలకు, కుడి కాలికి గాయం కావడంతో ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో చికిత్స తీసుకుంటున్నాను. ప్రమాదం జరిగినప్పుడు ఇక బతకనేమోనన్న అనుమానం ఉండేది. డాక్టర్ల వల్ల ఆ పరిస్థితి నుంచి బయటపడ్డాను.

–వెంకటేష్, రేమట గ్రామం, కర్నూలు మండలం

ప్రభుత్వ పథకాలపై అవగాహన



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

సి.బెళగల్: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం సి.బెళగల్ మండలంలోని కంబదహాల్, చింతమానుపల్లె గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాట్లాడుతూ.. పథకాలకు అర్హులైన పేదలందరికీ ఫలాలను అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం ఆయా శాఖలకు చెందిన మండల అధికారులు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలు, అర్హతలు, లబ్ధి, దరఖాస్తు, అమలు విధివిధానాలను తెలియజేశారు. వైద్య పథకాలను సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ సునీత, వ్యవసాయ అనుబంధ పథకాలను ఏఓ మల్లేష్‌కుమార్, హౌసింగ్ పథకాలను ఏఈ సుమంత్, ఉపాధిహామీ పనులపై ఏపీఓ లక్ష్మన్న వివరించారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు శోభారాణి, వైఎస్సార్‌సీపీ నేత రాముడు, బీజేపీ నాయకులు ప్రేమ్‌కుమార్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి

కల్లూరు: ఓఆర్‌హెచ్‌ఎస్ ట్యాంక్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మెయిద్దీన్ అన్నారు. శుక్రవారం బొల్లవరం హంద్రీ నదిలో నిర్మిస్తున్న బావి (రింగు) ఫౌండేషన్ పనులను, నూతనంగా నిర్మిస్తున్న ఓఆర్‌హెచ్‌ఎస్ ట్యాంక్ కొలతను పరిశీలించారు. అలాగే బస్తిపాడు గ్రామంలో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా నిర్మిస్తున్న ట్యాంకు, జగనన్న కాలనీలో పైప్‌లైన్ పనులను పరిశీలించారు.

పేదల చదువుపై తప్పుడు ప్రచారం

కర్నూలు సిటీ: పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని, దీనిని ఓర్వలేక టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని పసుపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు తాగు నీరు అందని పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆయా పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని, కార్పొరేట్‌కు దీటుగా వసతులు మెరుగుపడ్డాయని చెప్పారు. ప్రస్తుతం సర్కారు స్కూళ్లలో నేలబారు చదువులు లేవని, ప్రతి ఒక్క విద్యార్థి బెంచీలపై కూర్చొని చదువుకుంటున్నాడని అన్నారు. ప్రతి రోజు విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు ఏటా జగనన్న విద్యా కానుక అందజేస్తున్నారన్నారు. ధనవంతుల పిల్లలకే పరిమితమైన ఇంగ్లిష్ మీడియం చదువులను పేదల చెంతకు చేర్చారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మండల కన్వీనర్ మహబూబ్ బాష, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, నాయకులు శేఖర్, క్రిష్ణ, వెంకటేష్, చాంద్ బాషా, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

క్రీడానైపుణ్యాలను వెలికి తీసేందుకే పోటీలు

కర్నూలు సిటీ: ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ తెలిపారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని పసుపల గ్రామంలో ఆడుదాం ఆంధ్రలో భాగంగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి ప్రసంగించారు. మారుమూల ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నా ప్రదర్శించే వేదికలు, ప్రోత్సాహం లేక వారు మరుగున పడుతున్నారని అన్నారు. అలాంటి వారిని గుర్తించి సర్కారు ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాలీబాల్ క్రీడాకారులతో కలిసి ఆట ఆడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మండల కన్వీనర్ మహబూబ్ బాషా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు డి.వాసు, శేఖర్, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

- హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు



గడివేముల: కబడ్డీలో గెలుపొందిన జట్టు



కోడుమూరులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



కోడుమూరు: లద్దగిరిలో ఖోఖో..

కోడుమూరు రూరల్: గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు కోడుమూరు మండలంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు నిర్వహిస్తున్న క్రికెట్, ఖోఖో కబడ్డీ, వాలీబాల్, బాల్ బాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. గ్రామ స్థాయిలో గెలుపొందిన జట్లకు మండల స్థాయిలో పోటీలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

–గడివేముల: గడివేములతో పాటు కరిమద్దెల, గని, గడిగరేవుల జెడ్పీ పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన పోటీల్లో గ్రామీణ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పలువురు అధికారులు సూచించారు. క్రీడలతో శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

క్రీడలతోనే శారీరక దృఢత్వం

ఓర్వకల్లు: యువత క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీరం దృఢపడుతుందని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి అన్నారు. ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా నన్నూరు సమీపంలోని రాగమయూరిలో నిర్వహించిన క్రికెట్ పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యతను వెలికితీసేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత క్రీడాపోటీల్లో రాణించి ప్రతిభ చాటుకోవాలని సూచించారు. ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ మధువెంకటకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.



ఓర్వకల్లు: క్రీడాకారులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి

మౌలిక వసతులకు ప్రాధాన్యం

కల్లూరు: కల్లూరు అర్బన్ వార్డులో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 29వ వార్డు సొసైటీ కాలనీలో రూ.75 లక్షలతో చేపట్టనున్న డిస్పోజల్ డ్రైనేజీ కాలువ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. పాలక వర్గం వచ్చాక నగరం పురోభివృద్ధిలో పయనిస్తుందన్నారు. పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి అవినీతి రహితంగా పాలన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కర్నూలు, అన్నమయ్య జిల్లాల మహిళా విభాగం ఇన్‌చార్జ్ (కార్పొరేటర్) శ్వేతారెడ్డి, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు అ'ధర' హో

- మార్కెట్‌లో క్వింటా రూ.15వేలు



కొత్తూరు గ్రామంలో సాగు చేస్తున్న పొగాకు

పాణ్యం: ఖరీఫ్‌లో సాగు చేసిన పొగాకు పంటకు మార్కెట్‌లో గిటుబాటు ధర పలుకుతుండడంతో రైతులు కాస్త లాభాలు పొందుతున్నారు. మండలంలో ఈ ఏడాది సాగు చేసిన పొగాకు అన్ని రకాలుగా కలిసి రావడం, సకాలంలో ఎస్సార్బీసీ కాల్వలకు సమృద్ధిగా నీరు అందడంతో రైతులు 71 హెక్టార్ల (195 ఎకరాలు)లలో పొగాకు సాగు చేశారు. రెండు రకాల పొగాకును సాగు చేస్తున్నారు. మంచి దిగుబడితో పాటు మార్కెట్‌లో క్వింటా రూ. 15 వేల వరకు పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన సాగు విస్తీర్ణం

ఈ ఏడాది సాధారణం కన్నా తక్కువగా వర్షపాతం నమోదైంది. సాగు విస్తీర్ణం కొంత వరకు తగ్గింది. సాగు నీటికి ఇబ్బందులు వస్తాయని ఊహించి కొందరు ఆరుతడి పంటలను వేశారు. అధికంగా జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పంటలను సాగు చేశారు. నీరు సమృద్ధిగా ఉన్న రైతులు మాత్రం పొగాను వేశారు. సాగువిస్తీర్ణం తగ్గడంతో ఈ ఏడాది క్వింటా రూ. 15వేల వరకు పలుకుతున్నట్లు వ్యాపారులు తెలిపారు.

పొగపొగాకు ప్రాధాన్యత: మండల రైతులు ఎక్కువగా పొగాకు సాగుకు ప్రాధాన్యత ఇస్తారు. కౌలు కలుపుకోని ఎకరానికి రూ. 60వేల వరకు ఖర్చు అవుతుంది. దిగుబడికి వచ్చిన తర్వాత రైతులు నెలపాటు పొగపెడతారు. గాలి తగలకుండా రైతులు ఎంతో జాగ్రత్తలు తీసుకుని విక్రయానికి రెండు మూడు రోజుల్లో బటకు తీసి బేళ్లుగా ప్యాక్ చేసి విక్రయిస్తారు. క్వింటా ఒక బేళ్లుగా ప్యాక్ చేస్తారు. అన్ని రకాల వాతవరణం అనుకూలిస్తే ఎకరానికి 13 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే సుధాకర్
- పెంచికలపాడులో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



పెంచికలపాడులో ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహంతో పేద విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. పెంచికలపాడు హైస్కూల్‌లో శుక్రవారం హెచ్‌ఎం సాయిలీల ఆధ్వర్యంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, తాగునీరు, టాయిలెట్లు, ప్రహరీ గోడల ఏర్పాటు, డిజిటల్ విద్య, ఇంగ్లిష్ మీడియం, విద్యార్థులకు యూనిఫాం, బూట్లు, పుస్తకాలు, బ్యాగు, తదితర వస్తువులను అందించడం జరిగిందన్నారు. కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందించేందుకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. పేద విద్యార్థులు బాగా చదువుతుంటే ఓర్వలేని టీడీపీ, కొన్ని దినపత్రికలు విషం చిమ్ముతూ చదువులపై తప్పుడు రాతలు, ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. టీడీపీ నాయకులు చెప్పే మాయమాటలను నమ్మవద్దన్నారు. ప్రతి విద్యార్థి ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లతమ్మ, భాస్కర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, చికెన్ మౌలాలి, ఎస్.మల్లికార్జున, మగ్బుల్ బాషా, రాముడు, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, సుంకన్న పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సేవల పరిశీలన

కల్లూరు: బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బీజేపీ నియోజకవర్గ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఓపీ, వైద్య సేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాల అమలు, పరిసరాలను పరిశీలించారు. నాయకులు చెన్నయ్య, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.